# విభారే తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


## జేసీ ప్రభాకర్‌రెడ్డి మాస్ వార్నింగ్

తాడిపత్రి యాడికి వాసులకు జేసీ ప్రభాకర్‌రెడ్డి వార్నింగ్ ఇస్తూ వీడియో విడుదల చేసారు. ఆలయకుంటను కబ్జాచేసిన వారిని వదిలేది లేదని అన్నారు. అక్రమ నిర్మాణాలను జేసీబీలతో పడగొడతానని హెచ్చరించారు. గత ఐదేళ్లలో అక్రమ కట్టడాలు చేపట్టారని జేసీ ఆరోపించారు. రికార్డులు ఉంటే తీసుకుని రావాలి. లేకుంటే ఏ పార్టీవారైనా ఉపేక్షించేది లేదని అయన హెచ్చరించారు.







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం 12-01-2025 సంపుటి : 06 సంచిక : 240 పేజీలు : 8 వెల : రూ 3-00


# రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం

**కాలుష్య రహిత వాతావరణం ఏర్పాటు**
**గ్రీన్ ఎనర్జీ ద్వారా రూ.10లక్షల కోట్ల పెట్టుబడులు**
**హరిత ఇంధన ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్**
**మీడియాతో ఇష్టాగోష్టిలో చంద్రబాబు నాయుడు**



అమరావతి,జనవరి11: రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ విప్లవం రానుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విద్యుత్ రంగలో ఇదో విప్లవానికి నాంది కానుందని అన్నారు. రూ. 10లక్షల కోట్ల పెట్టుబడులు గ్రీన్ ఎనర్జీ రూపంలో రానున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ తయారవుతుందని అన్నారు. మిగిలిన ప్రాంతాల్లో తయారయ్యే సౌర, పవన, పనీపడ్ స్టోరేజ్ విద్యుత్‌ను పూడిమాడకకు తెస్తే వాటి ద్వారా హెడ్రోజన్ ఉత్పత్తి అవుతుందని చెప్పారు. ఉత్పత్తయ్యే హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం మీడియాతో ఇష్టాగోష్టి సందర్భంగా హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని దీంతో ఎగుమతులు పెరిగి మనకు లాభం వస్తుందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని తెలిపారు. ఎన్టీపీసీలో బొగ్గు మండించటం ద్వారా వచ్చే కార్బన్ డైయాక్సైడ్‌ని పూడిమడక తెచ్చి హైడ్రోజన్ ఉత్పత్తికి వాడితే కాలుష్యం తగ్గుతుందన్నారు. గ్రీన్ కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టెకోవర్ చేసి గ్రీన్ ఆమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారని చెప్పారు. మీద రూ. 25వేలకోట్ల పెట్టుబడులు పెడుతున్నారన్నారు. కాకినాడ పోర్టు ద్వారా ఎగుమతులు జరుగుతాయని చెప్పారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్డ్ గ్యాస్ తయారీకి 500కేంద్రాలు పెడుతోందని వివరించారు. ఒక్కో కేంద్రం రూ. 130కోట్ల పెట్టుబడి పెడుతున్నారని చెప్పారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుందని తెలిపారు. ఈ గడ్డి పెంచటానికి ఎకరాకు రూ. 30వేల కౌలు రైతులకు రిలయన్స్ చెల్లిస్తుందన్నారు. ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుందని చెప్పారు. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ను కుప్పంకి తెచ్చిందన్నారు. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుందని అన్నారు. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'ఈ కేంద్రాల వల్ల ఉద్యోగాలు వచ్చి, గ్యాస్ ఉత్పత్తిలో వచ్చే వ్యర్థాలు భూసారం పెంచేందుకు ఎరువు గానూ ఉపయోగపడుతుంది. బెంగుళూరుకు చెందిన ఓ సంస్థ స్వాపింగ్ బ్యాటరీలు మోడల్‌ని కుప్పంకి తెచ్చింది. కుప్పంలో సూర్యఘర్ అమల్లో ఉన్న ఇళ్లకు స్వాపింగ్ బ్యాటరీలు ఛార్జింగ్ చేసుకునేందుకు ఇంటి యజమానికి డబ్బులు చెల్లిస్తుంది. ఇది కుప్పం సూర్యఘర్ ఇంటి వాసులకు అదనపు ఆదాయం కానుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాల ఏర్పాటు ఉచితంగా పెడుతున్నాం. మిగిలిన వారికి కూడా సౌర ఫలకాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ రాయితీ పోను మిగిలిన ఫలకాలను రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుంది. ప్రభుత్వ పెట్టుబడి తిరిగి వచ్చే వరకూ కొంత మొత్తం విద్యుత్ వెనక్కి తీసుకుంటాం. ప్రభుత్వ పెట్టుబడి తిరిగి వచ్చాక యూనిట్ మొత్తంఇంటియజమానికి అప్పగిస్తాం. కుప్పంలో కొంతమందికి మానసిక ఎదుగుదల సమస్యలు, వినికిడి, మాటలు రాని సమస్యలు ఉన్నాయి. పిల్లల్లో సృజనాత్మకత పెంచటానికి యాప్‌ల సాయంతో శిక్షణ ఇస్తున్నారు. ఇది సత్ఫలితాలు ఇస్తున్నందున రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తెస్తాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు.

# గ్రీన్ కో ఫవర్ ప్రాజెక్టు దేశానికే తలమానికం

**డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్**



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11--గ్రీన్ కో ఫవర్ ప్రాజెక్టు దేశానికే తలమానికం అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. శనివారం నాడు గని సోలార్ విద్యుత్ ప్రాజెక్టు, పిన్నాపురం గుమ్మటంతాండా మధ్య పంప్డ్ స్టోరేజ్ పాయింట్, పవర్ హౌస్, టిఆర్సీ వ్యూపాయింట్ పరిశీలించారు. అనంతరం విలేఖరులతో మాట్లాడారు. అటవీ యాక్ట్ ఉల్లంఘున అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకుపోతాను. ఏపీ లో 50 శాతం వ్యవసాయానికి విద్యుత్ అందించే సత్తా గ్రీన్ కో ఫవర్ ప్రాజెక్టుకే ఉందన్నారు. లక్షన్నర కోట్లు పెడుతున్నారు. డిప్యూటీ సీఎం వెంట రాష్ట్ర రోడ్డు భవనాలు, మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బి.సి. జనార్దన్ రెడ్డి , కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు రంజిత్ బాష , రాజకుమారి గణియా తదితరులు అధికారులు ఉన్నారు .

# ఏపీలో అధికారికంగా వడ్డే ఓబన్న జయంతి

**ట్వీటర్ ద్వారా వెల్లడించిన ఏపీ సీఎం చంద్రబాబునాయుడు**



అమరావతి, జనవరి 11: బీసీల ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు ట్విటర్ వేదికగా వెల్లడించారు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటునే ప్రథమ స్వాతంత్ర్య యుద్ధం అంటారని, కానీ అంతకుముందే 1846లో తెలుగునాట ఉయ్యాలవాడ నరసింహ రెడ్డితో కలిసి బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వడ్డే ఓబన్న తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరోచితంగా పోరాడారని సీఎం పేర్కొన్నారు. ఆనాటి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు నిర్ణయించామని ఆయన తెలిపారు. వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి మంత్రి లోకేష్ నివాళి అర్పించారు. వడ్డే ఓబన్నకు ఆదర్శంగా మెరుగైన సమాజం నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# అల్లు అర్జున్‌కు ఊరట

హైదరాబాద్, జనవరి 11: హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. ప్రతి ఆదివారం హాజరు కావాలన్న నిబంధనను కోర్టు మినహాయించింది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరుకావాలని గతంలో కోర్టు షరతు విధించింది. అయితే భద్రతా కారణాల దృష్ట్యా మినహాయింపు ఇవ్వాలని అల్లు అర్జున్ కోరారు. దీనికి నాంపల్లి కోర్టు అంగీకారం తెలిపింది. మరోవైపు అల్లు అర్జున్ విదేశాలకు వెళ్లేందుకు కూడా న్యాయస్థానం అనుమతించింది. కాగా.. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో సినీ నటుడు అల్లు అర్జున్‌ను నాంపల్లి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. సంధ్య థియేటర్ ఘటనలో ఇన్వెస్టిగేషన్ జరుగుతున్న నేపథ్యంలో విచారణకు సహకరించాలని చెబుతూ ప్రతీ ఆదివారం కూడా విచారణకు హాజరుకావాలని కోర్టు షరతు విధించింది. ప్రతీ ఆదివారం కూడా అల్లు అర్జున్ చిక్కడపల్లి పోలీస్‌స్టేసన్‌కు వెళితే భద్రతాపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని.. ఆదివారం రోజున వ్యక్తిగతంగా విచారణకు హాజరయ్యే అంశాన్ని ఎత్తివేయాలని నాంపల్లి కోర్టులో మరొక పిటిషన్‌ను బన్నీ దాఖలు చేశారు.దానిపై విచారించిన నాంపల్లి కోర్టు.. ప్రతీ ఆదివారం విచారణకు మినాహాయింపు ఇచ్చింది.. అర్జున్‌ను విచారణ చేయాలని భావిస్తే నోటీసు ఇచ్చి పోలీసులు విచారణ జరపవచ్చని తేల్చిచెప్పింది.







# మాజీ బీజేపీ ఎమ్మెల్యే ఇంట్లో కట్టల కట్టల డబ్బులు

భోపాల్, జనవరి 11, (న్యూస్ పల్స్) ( ఐటెం నెంబర్ 22 కరెక్షన్ తో) సినిమాల్లో చూపించినట్టుగానే గత కొంతకాలంగా మన దేశంలో కొంత మంది ప్రజాప్రతినిధుల ఇంట్లో భారీగా డబ్బు, నగదు, బాండ్లు లభ్యమవుతున్నాయి. ఆ మధ్య జార్ఖండ్ రాష్ట్రంలో హోం మంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ సోదాలు చేసింది.. ఆ సమయంలో అతని వద్ద భారీగా నగదు, బంగారం లభ్యమయింది.. దీంతో అధికారులకు దిమ్మతిరిగినంత పని అయింది.తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ కి చెందిన ఓ మాజీ ఎమ్మెల్యే హరి వంశ్ సింగ్ రాథోడ్ ఇంట్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు సోదాలు జరిపారు. అలా సోదాలకు వెళ్లిన అధికారులకు దిమ్మతిరిగే షాక్ తగిలింది. అక్కడి దృశ్యాలు చూసి వారికి ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. అక్కడ బంగారం చూస్తే కేజీఎఫ్ గోల్డ్ మైన్ కనిపించింది. నగదును చూస్తే.. ఆర్బీఐ మింట్ కాంపౌండ్ దర్శనమిచ్చింది. ఎందుకంటే అక్కడ ఆ స్థాయిలో నిలువలు ఉన్నాయి కాబట్టి.. బంగారం, కట్టల కొద్ది నగదు, వాహనాలు మాత్రమే కాదు అక్కడ ఉన్న మూడు మొసళ్ళను చూసి అధికారులు ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.గత ఆదివారం నుంచి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంట్లో సోదాలు జరుగుతున్నాయి.

ఇతడితో పాటు మాజీ కౌన్సిలర్ రాజేష్ కేసర్వాణి ఇంట్లోనూ ఐటీ అధికారులు సోదాలు జరుపుతున్నారు. జాతీయ మీడియాలో వస్తున్న వార్తల ప్రకారం సుమారు 155 కోట్ల రూపాయల పన్నును బిజెపి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఎగవేసినట్టు సమాచారం. మాజీ ఎమ్మెల్యే ఇంట్లో మూడు కోట్ల నదులతో పాటు బంగారం, వెండిని అధికారులు స్వాధీనం చేసుకొని, సీజ్ చేశారు. బంగారం, వెండి విలువ కోట్లలో ఉంటుందట.మాజీ ఎమ్మెల్యే రాథోడ్, కేశర్వాణి ఇద్దరూ బీడీల వ్యాపారం చేసేవారు. ఇందులో కేశర్వాణి 140 కోట్ల వరకు పన్ను ఎగవేశారట. అయితే దానికి సంబంధించిన దస్త్రాలను సోదాల సమయంలో ఐటీ అధికారులు గుర్తించారు. మరోవైపు కేశర్వాణి స్థిరాస్తి వ్యాపారంలో కూడా ఉన్నాడు.. మాజీ ఎమ్మెల్యే రాథోడ్ ఇంటికి వెళ్ళినప్పుడు ఐటి శాఖ అధికారులకు ఒక చిన్న కుంటలో మొసళ్ళు కనిపించడంతో ఒక్కసారిగా షాక్ కు గురయ్యారు.

వాటిని చూసి వారు వెంటనే అప్రమత్తమయ్యారు. కేశర్వాణి ఇంట్లో విలాసవంతమైన వాహనాలు ఉన్నాయి. పని కూడా బినామీ పేర్లతో ఉన్నాయి. రవాణా శాఖ నుంచి సమాచారం సేకరించి ఆ వాహనాల వివరాలను అధికారులు ఆరా తీస్తున్నారు.. ఇక ఇదే రాష్ట్రంలోని సాగర్ జిల్లాలో రాథోడ్ మొదట్లో వ్యాపారం చేసేవారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. మంత్రి పదవి కోసం తీవ్రంగా కృషి చేశారు. భారీగా డబ్బు ఖర్చుపెట్టినప్పటికీ ఉపయోగం లేకుండా పోయింది. రాథోడ్ తండ్రి హర్నాం సింగ్ రాథోడ్ గతంలో మధ్యప్రదేశ్ ప్రభుత్వంలో కీలకమైన మంత్రిగా పనిచేశారు. ఆ రోజుల్లోనే ఆయన భారీగా డబ్బు సంపాదించారు. తన తండ్రి సంపాదించిన డబ్బు ద్వారా బీడీల వ్యాపారం చేసిన రాథోడ్.. ఆ తర్వాత అంచలంచలుగా ఎదిగాడు. చివరికి ఐటీ అధికారులకు ఇలా చిక్కాడు.

# డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో

## 26.437 కేజీల గంజాయిని కాల్చి బూడిద చేసిన పోలీసులు

రాజన్న సిరిసిల్ల జనవరి 11, (న్యూస్ పల్స్) నిషేధిత గంజాయిని శాస్త్రీయ పద్దతిలో తగులబెట్టే ప్రక్రియలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సభ్యులు ఏఎస్పీ చంద్రయ్య,కమిటీ సభ్యులుమనకొండూర్ మండలం ఈదులగట్టపల్లి నందుగల వెంకటరమణ ఇన్సినేటర్స్ కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ లో నేషనల్ డ్రగ్ డిస్పోజల్ లో భాగంగా జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లో నమోదు కాబడిన 83 కేసులలో స్వాదీనపరచుకున్న 26 కిలోల 437 గ్రాముల నిషేధిత గంజాయిని జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్దతిలో తగులబెట్టడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలకు యువత బానిసలుగా మారి తమ అమూల్యమైన భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటున్నారని అన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్ధవంతంగా నిరోధిస్తున్నారని అన్నారు. జిల్లాలోని పోలీసుల స్వాధీనంలో ఉన్న మిగతా గంజాయిని కూడా విడతల వారీగా చట్ట ప్రకారం తగులబెట్టుట జరుగుతుందని తెలియజేసారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసే వారిపై పీడీ యాక్టులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఎస్పీ  వెంట అదనపు చంద్రయ్య, డిసిర్బీ సి.ఐ శ్రీనివాస్, ఆర్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# వైరా రిజిస్ట్రేషన్ ఆఫీసులో అర్ధరాత్రి రిజిస్ట్రేషన్లు

ఖమ్మం, జనవరి 11, (న్యూస్ పల్స్)కేరోజు 99 రిజిస్ట్రేషన్లు.. అది కూడా రాత్రిపూట.. ఇంతకీ ఆ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏం జరుగుతోంది? కోట్ల విలువైన భూమి.. రాత్రికి రాత్రే రిజిస్ట్రేషన్ అయింది. ఇలా ఒకటి కాదు రెండు కాదు 99 దాకా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. రాత్రిపూట ఈ వ్యవహారం జరగడం అనుమానాలకు తావిస్తోంది. ఇలా రిజిస్ట్రేషన్  అయిన భూమి విలువ దాదాపు వందల కోట్లు ఉంటుంది. ఈ సంఘటన జరిగిన వెంటనే రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిస్పందించారుఉమ్మడి ఖమ్మం జిల్లనుంచి భట్టి విక్రమార్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ఉన్నారు. వీరిలో భట్టి విక్రమార్క సొంత మండలం అయిన వైరాలో 99 రిజిస్ట్రేషన్లు ఒక్కరోజు రాత్రి పూర్తి కావడం అనుమానాలకు తావిస్తోంది.. వైరా సబ్ రిజిస్టర్ కార్యాలయం వేదికగా రాత్రి సమయంలో ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరిగింది. ఈ వ్యవహారం రిజిస్ట్రేషన్లు స్టాంపులు శాఖలో కలకలం రేపుతోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం  లో ఆమోదం పొందని స్థిరాస్తి ప్లాట్లకు 99 రిజిస్ట్రేషన్లు చేయడం విశేషం. వైరా అసెంబ్లీ నియోజకవర్గంగా ఉంది. ఇది ఖమ్మం నగరపాలక సంస్థకు దగ్గర్లోనే ఉంటుంది. వైరా పురపాలక సంఘంగా ఏర్పడింది. వైరా నియోజకవర్గ పరిధిలో కొనిజర్ల మండలం ఉంటుంది. జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఈ మండలంలో భూములకు విపరీతమైన ధరలు ఉన్నాయి. ఈ మండలంలో అనేకంగా స్థిరాస్తి వెంచర్లు ఉన్నాయి. కొన్ని వెంచర్ల నిర్వాహకులు ఎల్ ఆర్ ఎస్ పథకానికి దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇంకా రాలేదు. అయితే క్రమబద్ధీకరణకు అనుమతులు లభించని ప్లాట్లకు వైరా సబ్ రిజిస్ట్రార్ ఏకంగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయడం సంచలనం కలిగిస్తోంది. కొణిజర్ల మండలంలో తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాల్లో విస్తారంగా వెంచర్లు ఉన్నాయి. ఇక్కడ భూమికి విపరీతమైన డిమాండ్ ఉంది. ఇక్కడ ఏర్పాటుచేసిన వెంచర్లలో సరైన నిబంధనలు పాటించలేదని ఆరోపణలు ఉన్నాయి.. గత ప్రభుత్వం అనుమతి పొందని లేఅవుట్లలో స్థలాలను రిజిస్ట్రేషన్లు చేయకుండా నిబంధనలు విధించింది. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేవిధంగా కొనసాగిస్తోంది..లేఅవుట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయి. ఇప్పటివరకు 4.50 లక్షల దరఖాస్తులను పూర్తి చేసామని అధికారులు చెబుతున్నారు.. ఇక ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిటిసిపి, రెరా అనుమతులు పొందిన వెంచర్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది..ఎల్ ఆర్ ఎస్ లేకపోయినప్పటికీ గుట్టుగా రిజిస్ట్రేషన్లు చేయడం అనుమానాలకు తావిస్తోంది. దీని వెనక భారీగానే నగదు చేతులు మారిందని తెలుస్తోంది. ఈ విషయం తెలియడంతో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రంగంలోకి దిగారు.. రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు . ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని డిఐజికి ఆదేశాలు జారీ చేశారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే రెవెన్యూ శాఖలో ప్రక్షాళన మొదలుపెట్టారు.. దాదాపు అందరి అధికారులను బదిలీ చేశారు. చాలాకాలం ఒకే చోట పని చేసిన అధికారులను మరో ప్రాంతానికి ట్రాన్స్ఫర్ చేశారు. రెవెన్యూ విభాగంలో ఆధునిక సాంకేతికతకు పెద్దపీట వేశారు. ఇంత చేస్తున్నప్పటికీ ఇలా జరగడం రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులకు మింగుడు పడటం లేదు.

# ఆగని సైబర్ దాడులు

ముంబై, జనవరి 11, (న్యూస్ పల్స్)మోసగాళ్లు సాంకేతికతను తమకు అనుకూలంగా మలుచుకుని ప్రజలను మోసం చేసి సొమ్ము దోచుకుంటున్నారు. తాజాగా భారత్‌లో సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతుండడంతో ముంబైకి చెందిన ఓ వృద్ధురాలు రూ.1.5 కోట్లు పోగొట్టుకుంది. దక్షిణ ముంబైకి చెందిన 78 ఏళ్ల వృద్ధురాలు. ముంబై అత్యంత ప్రసిద్ధ ఆర్కిటెక్ట్ బంధువు. తనపై మనీ ఫ్రాడ్ ఫిర్యాదు అందిందని పేర్కొంటూ మోసానికి పాల్పడ్డాడు. యుఎస్ నుండి తన కుమార్తెకు ఆహారం పంపడానికి ఒక వృద్ధ మహిళ కొరియర్ సర్వీస్‌ను ఉపయోగించడంతో స్కామ్ చేశారు. వృద్ధురాలు కొరియర్ చేయడానికి ప్రయత్నించగా, మరుసటి రోజు ఆమెను సంప్రదించిన వ్యక్తి తాను కొరియర్ కంపెనీ నుండి మాట్లాడుతున్నానని చెప్పాడు.వృద్ధురాలు అక్రమంగా సరుకులు



రవాణా చేస్తుందని మోసగాడు భయపెట్టాడు. అలాగే వృద్ధురాలి పేరిట ఉన్న పార్శిల్‌లో వృద్ధురాలి ఆధార్ కార్డు, గడువు ముగిసిన పాస్‌పోర్టు, క్రెడిట్ కార్డు, 2000 అమెరికన్ డాలర్లు, అక్రమ వస్తువులు ఉన్నాయని తెలిపారు. అంతే కాకుండా వృద్ధురాలిపై మరికొన్ని ఆరోపణలు చేశాడుఆ తర్వాత వృద్ధురాలి నుంచి డబ్బులు వసూలు చేయాలనే లక్ష్యంతో మోసగాళ్లు పలు శాఖల ఉన్నతాధికారులను సంప్రదించారు. ఆడియో కాల్‌తో పాటు, ఉన్నతాధికారుల వేషధారణతో వీడియో కాల్ ద్వారా వృద్ధురాలిని సంప్రదించారు. ఆ తర్వాత అరెస్ట్ రిపోర్టుతో సహా పలు పత్రాలను బెదిరించారు. దీంతో భయపడిన వృద్ధురాలు వారి సూచనల మేరకు రూ.1.51 కోట్లను మోసగాళ్లకు పంపించింది. ఇలాంటివి దేశంలో ఎన్నో జరుగుతున్నాయి. మీ బ్యాంకు ఏటీఎం బ్లాక్ అయ్యిందనే, లేక కేవైసీ పేరుతో ఇలా రకరకాల సాకులు చెబుతూ జనాలను నిలువునా దోచుకుంటున్నారు.ఇటీవలి కాలంలో డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు జరుగుతున్నాయి. అందువల్ల, ఎవరైనా మిమ్మల్ని ఈ విధంగా సంప్రదిస్తే, ఏ కారణం బ్యాంక్ ఖాతా వివరాలు, డబ్బు లావాదేవీలు వంటి వివరాలు చెప్పవద్దు. పోలీసులు, ఆదాయపన్ను అధికారులమంటూ కాల్స్ చేసిన స్పందించవద్దు. ముఖ్యంగా బ్యాంకుల పేరుతో ఎవరు కాల్ చేసి వివరాలు అడిగినా ఎట్టి పరిస్థితుల్లో చెప్పవదని పోలీసులు సూచిస్తున్నారు. అలాగే కేవైసీకి సంబంధించి వివరాలు, ఓటీపీలు అస్సలు చెప్పకండి. లేకుంటే తీవ్రంగా మోసపోయే ప్రమాదం ఉంది.

# ప్రజల కోసం పోరాటాలు, త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ

## పల్నాడు జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

నకరికల్లు,పోరాటాలు త్యాగాలు చేసిన పార్టీ సిపిఐ అని పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నకరికల్లు లోని కాల్వ కట్ట వద్ద గల సిపిఐ కార్యాలయంలో సిపిఐ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకి మూడు సెంట్లు స్థలాలు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇవ్వాలి సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు.నకిరేకల్లు హరిచంద్రపురం ఎత్తిపోతల పథకాన్ని తోరితే గతిన పూర్తి చేయాలి అని డిమాండ్ చేశారు.నకరికల్లు నరసరావుపేట చిలకలూరిపేట వైయా చీరాల రహదారిని నాలుగు లైన్లుగా విస్తరింప చేయాలి అని అన్నారు.విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలంటూ సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. నకరికల్లు మండల గ్రామాలలో  ప్రభుత్వం బిగించిన విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలంటూ సిపిఐ ఆధ్వర్యంల జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు సిపిఐ జిందాబాద్, విద్యుత్ స్మార్ట్ మీటర్లు తొలగించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సామాన్య ప్రజలపై భారాలు మోపుతుందని అన్నారు. విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు పెంచి ప్రజలు నడ్డి విరుస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు.

# ఆదివాసీల హామీలను విస్మరిస్తే ప్రజాక్షేత్రంలో పోరు ఉధృతం



బీఆర్ఎస్ పార్టీ ఒత్తిడితోనే ఆదివాసి సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
ఇది బీఆర్ఎస్ పార్టీ విజయం
ఆదివాసీలకు అభయమేది ?
కాంగ్రెస్ పాలనలో ఆగమైన ఆదివాసి గూడేలు
కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, సీఎం చేసిన ప్రకటనలు తక్షణం అమలు చేయాలి
ఆదివాసీల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి
ఆదివాసీ, గిరిజనుల విద్య వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలి
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్:కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ఆదివాసి గూడేలు ఆగమయ్యాయని, అనేక సమస్యల సుడిగుండంలో ఆదివాసీలు జీవిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. కేవలం హామీలు ఇవ్వడం, ప్రకటనలు చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా తక్షణమే సమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేయాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ ఆదివాసి హక్కులు, సమస్యలపై పోరాట ఫలితంగానే శుక్రవారం నాడు ఆదివాసి సంఘాలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారని తెలిపారు. ఇది బిఆర్ఎస్ పార్టీ సాధించిన విజయమని స్పష్టం చేశారు. అయితే, తూతూ మంత్రంగా హామీలు ఇచ్చి చేతులు దులుపుకోవద్దని సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు.ఇటీవల తాను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్ తో కలిసి బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ఆదివాసి గూడేలను సందర్శించానని, ఆ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను స్వయంగా చూశానని తెలిపారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ గారి హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిన ఆదివాసి గూడేలు... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధికి దూరమయ్యాయని అన్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వీర్యమైందని, కానీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఆదివాసీలకు చేరువ చేసేలా కెసిఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఆదివాసిల విద్యా , వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించాలని సూచించారు. ప్రధానంగా అనేక సీజనల్ వ్యాధులతో ఆదివాసీలు సతమతమవుతున్నారని, కానీ వారికి సకాలంలో వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని స్పష్టం చేశారు. సీజనల్ వ్యాధుల కారణంగా అనేకమంది మరణించినప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని అన్నారు.ఆదివాసీ పిల్లలకు విద్యను అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలు కుదేలయ్యాయని, దాంతో గురుకులాల్లో చదువుకోవాలంటే విద్యార్థులు భయపడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా గురుకులల్లో విషాహారం తిని విద్యార్థులు మృతి చెందుతున్న కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఐటిడిఏ వ్యవస్థను పటిష్టం చేసి ఆదివాసి బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.ఆదివాసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. తక్షణమే ఆదివాసీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఆదివాసి హక్కుల కోసం, వారి సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఢిల్లీ ఎన్నికల్లో ఓబీసీ ఫైట్

న్యూఢిల్లీ, జనవరి 11, (న్యూస్ పల్స్)ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 26 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కానీ అంతకు ముందే రాజధాని ఢిల్లీలో రాజకీయ గందరగోళం నెలకొంది. జాట్ కమ్యూనిటీని కేంద్రంలోని ఓబీసీ జాబితాలో చేర్చాలని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్ర మోడీని డిమాండ్ చేశారు.ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఒక లేఖ రాశారు. ఈ లేఖలో జాట్ కమ్యూనిటీని కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది మాత్రమే కాదు ప్రధాని మోడీ 'జాట్ సమాజానికి' ద్రోహం చేశారని కేజ్రీవాల్ ఆరోపించారు. ఢిల్లీలో ఓబీసీ హోదా ఉన్న జాట్లను ఇతర అన్ని కులాలను కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చాలని కేజ్రీవాల్ అన్నారు.ఏ కులాన్ని అయినా ఓబీసీ జాబితాలో చేర్చే ప్రక్రియ ఏమిటో తెలుసా.. సమాచారం ప్రకారం, ఏదైనా కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలంటే లోక్‌సభ , రాజ్యసభలో ఒక బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాల్సి ఉంటుంది. ఆ తరువాత బిల్లు చివరకు రాష్ట్రపతికి వెళుతుంది. అక్కడి నుండి, రాష్ట్రపతి ఆమోదం పొందిన తరువాత ఆ బిల్లును అమలు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేయబడుతుంది.దేశంలో కొత్త చట్టం తీసుకురావాలంటే లోక్‌సభ, రాజ్యసభలో బిల్లును ఆమోదించాల్సిన విధానం. అదేవిధంగా, ఓబీసీలో కొత్త కులాన్ని చేర్చడానికి, బిల్లును ప్రవేశపెట్టడం ద్వారా కొత్త చట్టాన్ని తీసుకురావాలి. ప్రభుత్వం ఏదైనా కులాన్ని ఓబీసీలో చేర్చడానికి బిల్లు తీసుకురావాల్సి వస్తే, ముందుగా ఆ విషయంపై సాధారణ ప్రజలు, దాని నిపుణులు, తదితరులు అభిప్రాయాన్ని తీసుకుంటారు. అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత అందులో వచ్చిన సూచనల ఆధారంగా నిపుణుల బృందం ద్వారా ప్రభుత్వం దానిని రూపొందిస్తుంది. ముసాయిదాను రూపొందించిన తర్వాత, దానిని న్యాయ మంత్రిత్వ శాఖకు పంపుతారు

# అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించిన కేంద్ర మంత్రి అథవాలే పార్టీ

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేకు చెందిన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించింది. ఢిల్లీలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఆ పార్టీ తరపున బరిలో దిగనున్న మొత్తం 15 మంది అభ్యర్థుల జాబితాను ఆర్పీఐ విడుదల చేసింది. న్యూఢిల్లీ నుంచి శుభి సక్సేనా, పాలం నుంచి వీరేందర్ తివారీ, మాలవీయనగర్ నుంచి రాంనరేష్ నిషాద్ బరిలో దిగబోతున్నారు.కాగా ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుంది. మొత్తం 70 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల కోసం ఈ నెల 10న నోటిఫికేషన్ కూడా విడుదలైంది. ప్రస్తుతం నామినేషన్‌ల దాఖలు కొనసాగుతోంది. ఈ నెల 17 వరకు నామినేషన్‌లు వేసేందుకు అవకాశం ఉంది. ఈ నెల 18న నామినేషన్‌ల స్క్రూటినీ నిర్వహిస్తారు. నామినేషన్‌ల ఉపసంహరణకు ఈ నెల 20 వరకు గడువు ఉంది.ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. ఢిల్లీలో ఈసారి అధికార ఆమ్‌ఆద్మీ పార్టీ, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌ల నడుమ త్రిముఖ పోరు నెలకొంది. జాతీయంగా ప్రతిపక్ష ఇండియా కూటమిలో మిత్రపక్షాలుగా ఉన్న ఆప్, కాంగ్రెస్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్యర్థులుగా తలపడబోతున్నాయి. గత రెండు ఎన్నికల్లోనూ ఇక్కడ త్రిముఖపోరే జరిగింది. కానీ కాంగ్రెస్ ఏమాత్రం పోటీ ఇవ్వలేకపోయింది.ఢిల్లీలోని మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకుగాను కాంగ్రెస్ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటును కూడా గెలువలేకపోయింది. 2015లో ఆప్ 67 స్థానాల్లో, బీజేపీ 3 స్థానాల్లో విజయం సాధించగా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కలేదు. 2020లోనూ ఆప్ 62 స్థానాల్లో బీజేపీ 8 స్థానాల్లో గెలిచాయి. కాంగ్రెస్ పార్టీ మళ్లీ సున్నా స్థానాలకే పరిమితమైంది.

# ఏఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభలు జయప్రదం చేయండి

## ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు చిన్న బాబు, మల్లికార్జున్ పిలుపు

చిలకలూరిపేట,శ్రీకాకుళంలో ఫిబ్రవరి  6,7,8,9 తేదీలలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని  ఏఐవైఎఫ్ నియోజవర్గ అధ్యక్ష కార్యదర్శులు సౌటుపల్లి చిన్నబాబు, కె.మల్లికార్జున్ కోరారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట  సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ, కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రతి యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఆ హామీని తుంగలో తొక్కారని , నిరుద్యోగులకు తీవ్ర మోసం చేశారని అన్నారు. దేశంలో 4,28,278 మంది మహిళల పైన, 1,49,404 చిన్నపిల్లల పైన దాడులు, హత్యాచారాలు జరిగిన ఈ దేశంలో కేంద్ర ప్రభుత్వం వాటిని నిలువరించే పరిస్థితి లేదని అన్నారు. ఉత్తరాంధ్రకు జీవనాధారంగా ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు  కేంద్ర ప్రభుత్వం పూనుకోవడం, కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వత్తాసు పలకడం ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని అన్నారు. వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతానికి  నూతన పరిశ్రమలు ఏర్పాటు

## శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో కర్నూలు శ్రీసూర్య నారాయణ స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు

విభారేన్యూస్. కర్నూలు ప్రతినిధి. జనవరి 11.సోమవారం పౌర్ణమి సందర్భంగా శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి వ్రతములు అత్యంత వైభవోపేతంగా జరుగును ..కావున భక్తులు ఈ సదావకాశాన్ని వినియోగించుకొని శ్రీ రమా సహిత శ్రీ సత్య నారాయణ స్వామి వారి కృప కు పాత్రులు కాగలరు.. గమనిక :- ప్రధానంగా వ్రతం చేస్తున్న భక్తులు ఉదయం 9:15 నిమిషాలకు సంప్రదాయ దుస్తులతో రావాలని మనవి.. వ్రతములో భక్తులు దయచేసి పూజారికి సహకరించగలరు. పూజకు కావలసిన వస్తువులు: పాలు1/2లీటర్, పెరుగు10?, తేనే10?, నెయ్యి10?, చక్కర10?, చిన్న పాకెట్స్ చాలు. విడి పూలు - అర్చన కి, కట్టిన పూలు -3,టెంకాయలు- 6 జాకెట్ పీస్ -1వత్తిపత్తి -1 తమలపాకులు -20/-వక్కలు - 10/- అరటి పండ్లు -6వేరే పండ్లు -, అగర బత్తి -1, వాడని స్టీల్ గ్లాస్ (పంచామృత అభిషేకం కోసం )వ్రతం ప్రధానంగా -1116/-వ్రత సంకల్పం-116/-×సంప్రదిం చండి :-శ్రీధర్ శర్మ -7995202082 గూగుల్ ప్లే &ఫోన్ పే 8896123777ఆఫీస్ ల్యాండ్‌లైన్ 08518-234388

## 5 శతాబ్దాల స్వప్నం అయోధ్య శ్రీరామ మందిరం వేల్పులగోపాల్




విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి. జనవరి 11బిజెపి కర్నూలు జిల్లా కోడుమూరు అసెంబ్లీ వేల్పులగోపాల్ మాట్లాడుతూ ఎందరో రాజులు పాలించారు ప్రధాన మంత్రులుగా చేశారు వారెవరుచేయనటువంటిసాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొని భారత సంస్కృతికి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం ఐదు శతాబ్దాల చిరకాల కోరికను నెరవేర్చిన భారత సంస్కృతి సాంప్రదాయా లను గౌరవించే విధంగా యావత్ భారతావానికి అంకితం చేసిన మన భారత ప్రధానమంత్రి శ్రీనరేంద్రమోడీ కి భారతావని గర్వించే విధంగా పూర్తి చేసిన ఘనత మన ప్రధానమంత్రికే దక్కింది గనుక నేటికీ సంవత్సరం పూర్తి కానున్న సందర్భంగా 5 శతాబ్దాల స్వప్నం అయోధ్య శ్రీరామ మందిరంకు హిందూ క్యాలండర్ ప్రకారం అయోధ్య శ్రీరామ జన్మభూమిలోశ్రీబాలరామునిప్రాణప్రతిష్ఠజరిగినశుభసంద ర్భాన అందరికీ శుభాభినందనలు ఈసందర్భంగా శ్రీరామ ప్రాణ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని అయోధ్యలో 3 రోజుల వేడుకగా జరపనున్న శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ ప్రకటన చేశారు

## కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### వడ్డెర సంఘం నాయకులు




---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11-వడ్డే ఓబన్న జయంతిని జనవరి 11వ తారీఖున అధికారికంగా నిర్వహిస్తున్న కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు వడ్డెర సంఘం నాయకులు తెలిపారు . నంద్యాల జిల్లాలోని బీసీ వెల్ఫేర్ ఆఫీసు నందు ప్రభుత్వ అధికారుల సమక్షంలో వడ్డెర సంఘ నాయకులు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడ్డే ఓబన్న యొక్క జీవిత చరిత్రను స్మరించుకున్నారు ఆయన చేసిన సేవలను కొనియాడారు. వడ్డెర కమ్యూనిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు వడ్డే చక్రధర్ మాట్లాడుతూ వడ్డే ఓబన్న స్వాతంత్ర సమరయోధుడు యుద్ధ వీరుడు సర్వ సైన్యాధ్యక్షుడు గెరిల్లా యుద్ధ వీరుడుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కి సర్వ సైన్యాధ్యక్షుడుగా ఉండి ఆనాటి బ్రిటిషర్లపై అక్రమ పన్ను వసూళ్లకు పాల్పడుతున్నందుకు మన దేశం స్వాతంత్రం కొరకు ఆనాడే పోరాడి ప్రాణ త్యాగాలు చేశారని అన్నారు. అలాంటి వ్యక్తి మా వడ్డెర జాతిలో ఉండడం మేమందరం కూడా గర్వించదగ్గ విషయం ఆయనను స్మరించుకుంటూ ఆయన యొక్క పోరాటిస్ఫూర్తితో మా యొక్క వడ్డెర జాతి హక్కులు , మరియు వడ్డెర ప్రజలు నాయకులు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని ఘనంగా వడ్డే ఓబన్న జయంతిని ఘనంగా జరుపుకునే నివాళులర్పించారు.

# ప్లాటినం జూబ్లీ వేడుకలకు మంత్రాలయ మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుబుదేంద్ర తీర్థుల రాక



విభారే న్యూస్. కర్నూలు ప్రతినిధి. జనవరి 11ఎమ్మిగనూరు పట్టణంలో రేపు అనగా ఆదివారం నిర్వహించు 75 సంవత్సరాల ప్రభుత్వ బాలుర పాఠశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల వజ్రోత్సవ వేడుకలకు మంత్రాలయం మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శుభూదేంద్ర తీర్థుల వారిని ఆహ్వానించిన ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులు మాచాని వెంకటేష్, పారిశ్రామికవేత్త, సమాజ సేవకులు, మల్లెలప్రోఫ్డ్ రాజ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, కామలే గణేష్, ఈరన్న గౌడ్ పూర్వ విద్యార్థుల మిత్రబృందం, ఈరోజు స్వామివారికి ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలను అందజేసి ప్లాటినం జూబ్లీ వేడుకలకు సవినయంగా ఆహ్వానించడం జరిగింది. రేపు నిర్వహించు ప్లాటినం జూబ్లీ వేడుకల సంబరాల్లో శ్రీ రాఘవేంద్ర స్వామి ఆశీస్సులు నిండుగా ఉంటాయని కమిటీ వారికి ప్రత్యేకంగా స్వామివారి పూజా అక్షింతలను మంత్రాలయం పీఠాధిపతి వారు ప్లాటినం జూబ్లీ కమిటీ సభ్యులను ఆశీర్వదించి మీ కార్యక్రమం దిగ్విజయం జరగాలని, శ్రీ రాఘవేంద్ర కృప ప్లాటినం జూబ్లీ కమిటీ నిర్వహణకు సహకరిస్తుందని ఆశీర్వదిస్తూ, ప్లాటినం జూబ్లీ నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు...

# మహానంది క్షేత్రంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు: ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్. శ్రీనివాసరెడ్డి




--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11-మహానంది పుణ్యక్షేత్రంలో సంక్రాంతి పండగ సందర్భంగా మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నల్లకాలువ శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13,వ తేదీన భోగి పండుగ సందర్భంగా సాయంత్రం 5.గంటలకు చిన్నారులకు సామూహిక భోగిపళ్ల కార్యక్రమం జరుగుతుందని తల్లిదండ్రులు పిల్లలను పిలుచుకుని వచ్చి భోగిపళ్ళ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 14,వ తేదీ మకర సంక్రమణం రోజున శ్రీ కామేశ్వరీ మహానందీశ్వర స్వామి వార్లకు ప్రత్యేక అభిషేకార్చనలు,ఉత్సవర్లక తిరుమంజనం నిర్వహించబడుతుందన్నారు . అలాగే హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల పూజలు నిర్వహిస్తామన్నారు. 15,వ తేదీన కనుమ పండుగ సందర్భంగా దేవస్థానం గోశాలలో ఉదయం పశువులకు ప్రత్యేక పూజలు,సాయంత్రం మహానంది గ్రామంలో పారువేట ఉత్సవంతో పాటు ముగ్గుల పోటీలు నిర్వహించబడుతుందన్నారు .మహానంది పరిసర ప్రాంతాల మహిళలు అధిక సంఖ్యలో ముగ్గుల పోటీలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీశైల దేవస్థానంలో సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



శ్రీశైలం మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకొని పంచాహ్నిక దీక్షతో నిర్వహించపబడే సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఈ రోజు శనివారం ప్రారంభమయ్యాయి.ఏడు రోజులపాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాలు 17వ తేదీతో ముగియనున్నాయి.లోక కల్యాణం కోసం నిర్వహించబడుతున్న ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతిరోజూ జ్యోతిర్లింగస్వరూపుడైన శ్రీమల్లికార్జునస్వామివారికి విశేషార్చనలు, మహాశక్తిస్వరూపిణి అయిన శ్రీభ్రమరాంబాదేవిఅమ్మవారికి ప్రత్యేక పూజలు, నవగ్రహ మండపారాధనలు, కలశార్చనలు, జపాలు, పారాయణలు నిర్వహించబడుతున్నాయి.ఈ ఉదయం 8.45 గంటల నుంచి ఆలయప్రాంగణంలో ఉత్సవ ప్రారంభ కార్యక్రమాలు ఆగమ శాస్త్రానుసారం జరిపించబడ్డాయియాగశాల ప్రవేశం ఉత్సవ నిర్వహణలో భాగంగా ముందుగా కార్యనిర్వహణాధికారి, శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు, ఉభయదేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు అధ్యాపక, అర్చకస్వాములు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా ఆలయప్రాంగణంలోని స్వామివార్ల యాగశాల ప్రవేశం చేశారు.వేదస్వస్తియాగశాల ప్రవేశం చేసిన వెంటనే లోకక్షేమాన్ని కాంక్షిస్తూ వేదపండితులు వేదపఠనతో వేదస్వస్తి నిర్వహించారు.శివసంకల్పంవేదస్వస్తి తరువాత దేశం శాంతిసౌభాగ్యాలతో విలసిల్లాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించ కుండా సకాలంలో తగినంత వర్షాలు కురువాలని, దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికి ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాలమరణాలు జరగకుండా ఉండాలనీ, దేశంలో అగ్ని ప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు, వేదపండితులు లోక కల్యాణ సంకల్పాన్ని చెప్పారు.గణపతిపూజ సంకల్పపఠనం తరువాత ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజను చేయడం జరిగింది.చండీశ్వరపూజ :గణపతిపూజ తరువాత శివ సంచార దేవతలలో ఒకరైన చండీశ్వరునికి విశేషపూజ జరిపించ బడింది. ఈ చండీశ్వరుడు స్వామివారి బ్రహ్మోత్సవ ఏర్పాటు చేస్తూ ఉత్సవాలను నిర్వహిస్తాడని చెప్పబడుతోంది.కంకణపూజ కంకణ ధారణ చండీశ్వర అర్చన తరువాత కంకణాలకు శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించబడ్డాయి. అనంతరం అధికారులు, అర్చకస్వాములు, స్థానాచార్యులు కంకణాలను ధరించారు.ఋత్విగ్వరణంకంకణధారణ తరువాత ఋత్విగ్వరణం నిర్వహించబడింది. బ్రహ్మోత్సవాలలో ఆయా వైదిక కార్యాలను నిర్వహించమని ఋత్వికులను ఆహ్వానిస్తూ వారికి దీక్షావస్త్రాలను అందజేసే కార్యక్రమానికే ఋత్విగ్వరణం అని పేరు.అఖండదీప స్థాపన :తరువాత అఖండ దీపస్థాపన, వాస్తుపూజ, వాస్తు హోమం జరిపించబడ్డాయి.వాస్తు హోమం తరువాత మండపారాధన, పంచావరణార్చన, ప్రధాన కలశస్థాపన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. శ్రీనివాసరావు దంపతులు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.సాయంకాలం కార్యక్రమాలుఅంకురార్పణ ఈ రోజు సాయంకాలం అంకురార్పణ జరిపించబడుతుంది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రాంగణంలోని నిర్ణీత ప్రదేశంలోని మట్టిని సేకరించి సంప్రదాయబద్ధంగా యాగశాలకు తీసుకువస్తారు. తరువాత ఈ మట్టిని 9 పాలికలలో మూకుళ్లలోనింపి దాంట్లో నవధ్యానాలు పోసి ఆ మట్టిని మొలకెత్తించేపనిని ప్రారంభిస్తారు. ఈ పాలికలలో రోజు నీరు పోసి నవధ్యానాలు పచ్చగా మొలకెత్తేలా చేస్తారు. ఈ విధంగా అంకురాలను ఆరోరింపజేసే కార్యక్రమం కాబట్టే దీనికి అంకురార్పణ అని పేరు.ధ్వజారోహణ అంకురార్పణ తరువాత జరిగే ధ్వజారోహణకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఆలయప్రాంగణంలోని ప్రధాన ధ్వజస్తంభం మీద పతావిష్కరణ చేయడమే “ధ్వజారోహణ”. ఈ కార్యక్రమములో ఒక కొత్తవస్త్రం మీద పరమశివుని వాహనమైన నందీశ్వరుని, అష్టమంగళ చిత్రాలను చిత్రీకరిస్తారు. దీన్నే ‘నందిధ్వజపటం’ అంటారు. దీన్ని ధ్వజస్తంభం మీద కట్టేందుకు నూలుతో చేసిన తాడును సిద్ధం చేస్తారుఈ నంది ధ్వజపటాన్ని ఊరేగింపుగా, ధ్వజస్తంభం వద్దకు తెచ్చి, చండీశ్వరస్వామి సమక్షములో పూజాదికాలను నిర్వహిస్తారు.ధ్వజారోహణలో భాగంగానే భేరీపూజ, కూడా నిర్వహించబడుతుంది. ఈ భేరీపూజలో డోలు వాద్యానికి పూజాదికాలు జరుగుతాయి. తరువాత నాదస్వరంపై ఆయా రాగాల ఆలాపనతో దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తారు.చివరగా ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. ధ్వజస్తంభం మీద ఎగిరే ఈ నంది పతాకమే సకల దేవతలకు, యక్ష, గంధర్వ గణాలకు ఆహ్వానం అన్నమాట. ఈ ఆహ్వానంతో విచ్చేసిన దేవతలకు నిర్ణీత స్థలాలు కేటాయించి రోజూ విధివిధానంగా వారికి నివేదన సమర్పిస్తారు.ఈ బ్రహ్మోత్సవాలలో సకల దేవతలు క్షేత్రములోనే ఉంటూ ఉత్సవాలను తిలకిస్తారని ఆగమశాస్త్రాలు పేర్కొంటున్నాయి.రేపటి కార్యక్రమాలుఈ బ్రహ్మోత్సవాలలో భాగంగా రేపు 12.01.2025 శ్రీస్వామి అమ్మవార్లకు విశేషపూజలు, చండీశ్వరపూజ, మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, రుద్రహోమం, సాయంకాల నిత్యహవనాలు జపాలు, పారాయణలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.ఈ ఉత్సవాలలో భాగంగా రేపు సాయంకాలం శ్రీస్వామిఅమ్మవార్లకు భృంగివాహనసేవ ఊరేగింపు జరిపించబడుతుంది

## రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కి స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నంద్యాల జిల్లా పాణ్యం మండలం పర్యటన సందర్భంగా హెలి ప్యాడ్ వద్ద నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా. జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా స్వాగతం పలికారు. కందికాయపల్లే గ్రామంలో ప్రపంచంలోనే మొదటిది,పెద్దది అయిన గ్రీన్ కో ఇంటిగ్రేటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ ప్రాజెక్ట్ సందర్శనకు విచ్చేసిన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు .

## విజిలెన్స్ అండ్ మానిటరింగ్ నియామక పత్రం అందుకున్న నాగ నవీన్



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11-నంద్యాల జిల్లా విజిలెన్స్ అండ్ మానిటింగ్ కమిటీ సభ్యునిగా ముద్దం నాగ నవీన్ నంద్యాల నియోజకవర్గం నుంచి ఎన్నుకున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సూపరెంట్ జమునకుమారి మరియు మురళీకృష్ణ తెలిపారు .శనివారం ముద్దం నాగ నవీన్ కు కలెక్టర్ ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. ముద్దం నాగ నవీన్ మాట్లాడుతూ నంద్యాల 19 వార్డు నుంచి నన్ను నా సేవలను గుర్తించి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎంపిక చేసిన జిల్లా అధికారులకు రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ మిత్రులకు. ధన్యవాదాలు తెలియజేశారు.

## శానిటేషన్ కార్మికులకు జీతాలు ఇవ్వండి : సీఐటీయూ నాయకులు డిమాండ్




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి జనవరి 11-నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మరియు నంద్యాల వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికుల మూడు నెలల నుంచి జీతాలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వి, బాల వెంకట్ ఏపీ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా నాయకులు ప్రసాద్ లు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి మరియు నంద్యాల వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి లో ఉన్నటువంటి ఇన్చార్జి సూపర్డెంట్ కు శానిటేషన్ కార్మికులతో కలిసి వినతి పత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు గురు స్వామి, చెన్నయ్య, మద్దిలేటి, శివకుమార్, లక్ష్మీదేవి, నాగలక్ష్మి, కుమారి, రాజు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190